క్లుప్తంగా

నేడు కేవీకేలో మిల్లెట్ మేళా

కడప అగ్రికల్చర్: కడప నగర శివార్లలోని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం మిల్లెట్ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కేవీకే కో ఆర్డినేటర్ అంకయ్యకుమార్ తెలిపారు. ఈ మేళలో రైతులకు చిరుధాన్యాల సాగు, పోషక విలువలు, ప్రాధాన్యత, వ్యాపార సరళిని పరిచయం చేస్తామన్నారు. ఇందులో భాగంగా చిరుధాన్యాల ఉత్పత్తులు, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన మొదలకు కార్యక్రమాలను నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 150 మంది రైతులు ప్రత్యక్షంగా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిరుధాన్యాల సాగులో ఆదర్శ రైతులను సన్మానిస్తామన్నారు. తరువాత శాస్త్రవేత్తలు, రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా కడప, అన్నమయ్య జిల్లాల వ్యవసాయ అధికారులు పాల్గొంటారని తెలిపారు.

రుణాలు ఇచ్చి ఆదుకోవాలి

కడప రూరల్ : జిల్లా ఎస్టీ కార్పొరేషన్ ద్వారా ఎస్టీ వర్గాలకు చెందిన నిరుపేదలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని పీఆర్ ఎస్వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కన్నెలూరు శంకర్ డిమాండ్ చేశారు. ఆ మేరకు శుక్రవారం ఆ శాఖ జిల్లా కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సరస్వతికి వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2025–26వ ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం తక్షణమే ఎస్టీ కార్పొరేషన్ ద్వారా రుణాల మంజూరు కోసం నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. ఇప్పటికే ఎస్టీ వర్గాలకు చెందిన నిరుద్యోగులు ఉపాధికి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి సబ్సిడీ రుణాల మంజూరుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి మా ఎగ్జిబిషన్ సేల్

కడప కోటిరెడ్డిసర్కిల్: దసరా పండుగను పురస్కరించుకుని కడప నగరం హరిత హోటల్‌లో మా ఎగ్జిబిషన్ అండ్ సేల్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20, 21, 22 తేదీలలో ఈ సేల్స్ ఉంటాయని తెలిపారు. కొత్త డిజైన్ శారీస్ ఫ్యాన్సీ, హ్యాండ్‌వర్క్ శారీస్, కలకత్తా, బెనారస్, జార్జెట్, కాటన్ శారీస్, కంచిపట్టు, కోటా శారీస్‌తోపాటు డ్రస్ మెటీరియల్, బెడ్‌షీట్స్, దివాన్ సెట్స్, ఫ్యాబ్రిక్ అందుబాటులో ఉంచామన్నారు.

రేపు కాలభైరవ పూజలు

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగర పరిధిలో బాసట స్వచ్ఛంద సేవా సంస్థ దత్తత గ్రామమైన శ్రీ కాలభైరవపురం (ఎమ్మెస్ కొట్టాలులో) ఉన్న శ్రీ ఇష్టకామ్యార్థ కాలభైరవ స్వామి దేవస్థానంలో ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు శ్రీధర్‌శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి వారికి అభిషేకం, అష్టోత్తరం, కాలభైరవ స్తోత్రం, అనంతరం కూష్మాండదీప సేవారాధన తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

బ్రౌన్ జయంతి ప్రభుత్వం నిర్వహించాలి

కడప సెవెన్‌రోడ్స్ : తెలుగుభాషా సాహిత్యాల సముద్ధరణ కోసం జీవితాంతం కృషి చేసిన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని జానమద్ది సాహితీపీఠం అధ్యక్షులు జానమద్ది విజయభాస్కర్ కోరారు. శుక్రవారం ముఖ్యమంత్రికి ఈ మేరకు వినతిపత్రం పంపారు. పలువురి వర్ధంతులు, జయంతులను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. ఈ కోవలో సీపీ బ్రౌన్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఆంగ్లేయ పాలకుడైనప్పటికీ తెలుగుభాష నేర్చుకుని సముద్ధరణకు కృషి చేశారన్నారు. ఆయన లేకపోయి ఉంటే వేమన పద్యాలతోపాటు మనుచరిత్ర, వసు చరిత్ర తదితర కావ్యాలు నేడు మనకు అందుబాటులో ఉండేవి కావని తెలిపారు. బ్రౌన్ పట్ల వివక్ష ప్రదర్శించడం తగదన్నారు. జాతీయ జెండా రూపశిల్పి అయిన పింగళి వెంకయ్య జయంతిని కూడా ప్రభుత్వం నిర్వహించాలని విన్నవించారు.

జాబ్‌మేళా



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కంపెనీ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని శ్రీనివాస ఇంజనీరింగ్ అటానమస్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో విదార్థులు తమ ప్రతిభను చాటి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. బెంగుళూరు ప్రధాన కేంద్రంగా నిర్వహిస్తున్న క్యూస్పైడర్స్ అనే సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో సీఎస్‌సీ, ఈసీఈ విభాగాలకు చెందిన 16 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాల తరుపున గత విద్యా సంవత్సరంలో అన్ని విభాగాల నుంచి 72 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఈ సంవత్సరం ప్రస్తుతానికి 16 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేపడితే చర్యలు



అడ్వయిజరీ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఉమామహేశ్వర్‌కుమార్

కడప రూరల్ : లింగ నిర్ధారణ పరీక్షలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వర్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆ శాఖ కార్యాలయంలోని ఛాంబర్‌లో కడప రెవెన్యూ డివిజన్ అధికారి జాన్ ఇర్విన్ ఆదేశాల మేరకు డివిజన్ సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప డివిజన్ పరిధిలోని స్కానింగ్ సెంటర్లను నిశితంగా పరిశీలించాలన్నారు. ఏ స్కాన్ సెంటర్ అయినా కూడా లింగ నిర్ధారణకు పాల్పడితే తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అనుమానిత స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్ నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ వ్యాధుల నిపుణులు డాక్టర్ రబ్బాని, పీసీడీఓ శోభారాణి, డాక్టర్ డేవిడ్ చక్రవర్తి, రేడియాలజిస్టు బాలకృష్ణ, తాలూకా సీఐ రెడ్డెప్ప, అడ్వకేట్ శ్రీకాంత్, డిప్యూటీ డెమో రమణమ్మ, డిప్యూటీ హెల్త్ ఆఫీసర్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ చాలా అవసరం



ఎస్పీ నచికేత్‌తో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, సిబ్బంది

కడప ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణ తో జీవించడం చాలా అవసరం అని కడప జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ అన్నారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన నచికేత్‌ను కడప ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ట్రాఫిక్ క్లబ్, సోషల్ క్లబ్, సైన్స్ క్లబ్ విద్యార్థిని విద్యార్థులు స్కూల్ యాజమాన్యం, ప్రిన్సిపాల్‌తోపాటు జిల్లా మేధావి సమాఖ్య అధ్యక్షులు వివేకానంద రెడ్డిలు కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీని సన్మానించారు. విద్యార్థులను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ ప్రతిక్షణం క్రమశిక్షణతో జీవితాన్ని గడపాలని, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ సంధ్యా, రజియా, లక్ష్మిదేవి, జయచంద్ర, ఓబుల్ రెడ్డి పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



కడప రైల్వే స్టేషన్‌లో నిరసన తెలుపుతున్న దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ నేతలు

కడప కోటిరెడ్డి సర్కిల్ : రైల్వేలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ కడప బ్రాంచ్ సెక్రటరీ ఎం.రవికుమార్, చైర్మన్ ఎల్‌వీ మోహన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కడప నగరంలోని రైల్వే స్టేషన్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8వ వేతన కమిషన్ సమయానికి సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రతి ఉద్యోగికి పది సంవత్సరాల ప్రయోజనాలను సాధించడం కోసం, మెరుగైన వేతన శ్రేణులు, సవరించిన అలవెన్స్‌లను, న్యాయమైన పెన్షన్ల కోసం పోరాడుతున్నామన్నారు. కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాలని సూచించారు. సీపీసీలో కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని, గెజిట్‌ను వెంటనే విడుదల చేయాలని, 2026 జనవరి 1 నుంచి 8వ సీపీసీ అమలు చేయాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సెక్రటరీ శ్రీరామకృష్ణయ్య, సభ్యులు వెంకటేశ్వరరెడ్డి, కుమార్, అనిల్‌కుమార్, శంకర్, మల్లికార్జున, ఓబయ్య, రమాదేవి, వేదావతి, ఓబుళమ్మ, గురుస్వామి, కరుణాకర్, ఆనంద్, రాహుల్, రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీ పరీక్షలు



విజేతలతో టీసీఎస్ సభ్యులు, ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్: కడప మండలం పాత కడప జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శుక్రవారం టాటా కన్సెల్టెన్సీ సర్వీసెస్(టిసిఎస్) ఆధ్వర్యంలో 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు జూనియర్ అండ్ సీనియర్ విభాగంలో స్వీయ ఆధారిత భారతదేశం నిర్మించడానికి మీరు చేసే ఐదు పనులు అనే అంశంపై పోటీ పరీక్షను నిర్వహించారు. ఈ పోటీలలో జూనియర్ విభాగంలో 8వ తరగతి క్యాంప, బాలగుర్రమ్మ, 9వ తరగతి మానసలు, సీనియర్ విభాగంలో పదవ తరగతి మమత, నాగచైతన్య, నాగబిందులు విజేతలుగా నిలిచి మెడల్‌తోపాటు ప్రశంసా పత్రాన్ని పొందారు. అలాగే టీసీఎస్ సంస్థకు సంబంధించిన వీడియోను ప్రదర్శించి సంబంధిత అంశంపై క్విజ్‌ను నిర్వహించగా 5 మంది విద్యార్థులు విజేతలుగా నిలిచారు. టిసిఎస్ సిబ్బంది ఫాతిమా, కరీమ్, అక్బర్, హేమవర్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి, ఉపాధ్యాయులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ విభాగం సమావేశాన్ని జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం మాజీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ ఎస్సీ విభాగం మాజీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేది పాతరిమ్స్‌లోని బీసీ భవన్‌లో ఉదయం 9 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎస్సీ విభాగం అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్ బాబు, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, జెడ్పీ చైర్మెన్, మేయర్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులపై దాడులు ఎక్కువయ్యాయన్నారు. ఎన్నికల ముందు ఎస్సీల సంక్షేమానికి అనేక హామీలు ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత దళితుల సంక్షేమాన్ని విస్మరించారన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్‌ను అమలు చేయడం లేదని, ఎస్సీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారన్నారు. వాటి ద్వారా ఏ ఒక్కరికీ రుణాలు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. 50 ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పింఛన్లు ఇస్తామని హామీ ఇచ్చి, అది అమలు చేయాలంటే ఇంకా కొంత కాలం పడుతుందని చెప్పడం భావ్యం కాదన్నారు. హోంమంత్రి దళిత మహిళ అయినప్పటికీ దళితులకు న్యాయం జరగడం లేదన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో దళితులను గ్రామ బహిష్కరణ చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. జిల్లా కార్యవర్గ సమావేశంలో వీటన్నింటిపై చర్చించి తగు కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ షఫీవుల్లా, క్రిష్టియన్ మైనార్టీ విభాగం కమలాపురం అధ్యక్షుడు బీఆర్ లారెన్స్ పాల్గొన్నారు.

సంజన్న సర్కిల్‌లో పైపులైన్ లీకేజీ



సంజన్న సర్కిల్‌లో పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి వృథా అవుతున్న నీరు

కడప కార్పొరేషన్: కడప నగరం చిన్నచౌకులోని సంజన్న సర్కిల్‌లో తాగునీటి పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. సుమారు వారం రోజులుగా నీరు వృథాగా ప్రవహిస్తున్నా ఎవరూ పట్టించుకోలేదు. కడప నగరానికి నీటిని సరఫరా చేసే ప్రధాన పైపులైన్ కావడంతో నిత్యం నీరు లీకేజీ అవుతూ ఉంది. దీనివల్ల ఇక్కడ రోడ్డు కూడా పూర్తిగా పాడైపోయింది. నగరపాలక అధికారులు స్పందించి పైపులైన్ లీకేజీని అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

కుల గణన చేశాక స్థానిక ఎన్నికలు జరపాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్. శివరామ్

కడప కార్పొరేషన్: కులగణన చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్. శివరామ్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు బీసీల పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే జన గణనలో కుల గణన చేపట్టిన తర్వాత బీసీల జనాభా ప్రాతిపదికన యాభై శాతం రిజర్వేషన్లు కల్పించి స్థానిక ఎన్నికలు జరపాలన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పారని అయితే అది సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధంగా ఉన్నందున రాష్ట్రంలో బీసీలు 60 శాతం ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు పెంపు బిల్లు అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంటులో ఆమోదింపజేయాలన్నారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం కుల గణన చేసి బీసీల జనాభా ప్రాతిపదికన నలభై రెండు శాతం రిజర్వేషన్లు కేటాయించి స్థానిక ఎన్నికలకు సమాయత్తం అవుతోందని, కానీ ప్రభుత్వం ఆదిశగా అడుగులు వేయలేదన్నారు. ఎన్నికల నాటికి న్యాయ పరమైన సమస్యలు ఉన్నాయని చెప్పి బీసీలకు వెన్నుపోటు పొడిస్తే మాత్రం రాష్ట్రంలోని బీసీలు మిమ్మల్ని శాశ్వితంగా రాజకీయ సమాధి చేస్తారని హెచ్చరించారు. సమావేశంలో బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవరాజు, రాష్ట్ర కార్యదర్శి శివ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. బాదుల్లా, రజక సంఘం నాయకులు క్రిష్ణ పాల్గొన్నారు.

ఉల్లి రైతులను ఆదుకునే వరకు పోరాటాలు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి ఈశ్వరయ్య



కలెక్టర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఉల్లి రైతులకు కనీస మద్దతు ధర రూ. 3వేలు కల్పించి ప్రభుత్వం న్యాయం చేసే వరకు పోరాటం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి ఈశ్వరయ్య తెలిపారు. శుక్రవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉల్లి దాదాపు 15వేల ఎకరాలు సాగు చేశారని ప్రభుత్వం కల్పించిన రూ.1200 ఏమాత్రం సరిపోదని, కనీస మద్దతు ధర రూ. 3వేలు నిర్ణయించి ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోకపోతే తీవ్ర పోరాటాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

ఉల్లి రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

జిల్లాలోని ఉల్లి రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. వి. సుబ్బారెడ్డి, పోతిరెడ్డి భాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం ఈ మేరకు జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు రైతు సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో మైదుకూరు, జమ్మలమడుగు, పులివెందుల, కమలాపురం నియోజకవర్గాలలో ఉల్లి పంటను సాగు చేశారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కేంద్రాలలో ఉల్లి కొనుగోలును వెంటనే ప్రారంభించాలని లేనిపక్షంలో ఉల్లి రైతుల పక్షాన ఏపీ రైతు సంఘం, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యం లో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గంగా సురేష్, సీపీఐ కమలాపురం నియోజకవర్గ కార్యదర్శి జి. నాగేశ్వర రావు, రైతులు పాల్గొన్నారు.

పోటీల్లో పాల్గొంటే ఆత్మస్థైర్యం పెరుగుతుంది



విజేతలతో డిప్యూటీ ఈఓ రాజగోపాల్ రెడ్డి, హెడ్‌మాస్టర్ వేపరాల ఎబినేజర్ తదితరులు

కడప ఎడ్యుకేషన్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు పలు పోటీలలో పాల్గొంటే వారిలో ఆత్మస్థైర్యం పెరుగుతుందని డిప్యూటి ఈఓ రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప శంకరాపురంలోని అంధుల ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి వారధి కాంపిటీషన్‌లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 8,9,10వ తరగతి విద్యార్థులకు ఎస్సే రైటింగ్‌తోపాటు డిబేట్ కాంపిటీషన్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో భాగంగా ఎస్సే రైటింగ్‌లో 9వ తరగతి చెందిన రక్షిత ద్వితీయ స్థానంలో నిలువగా, 9వ తరగతికి చెందిన ఎస్ఎండి అన్వర్ తృతీయస్థానంలో, 10వ తరగతికి చెందిన దీపిక ప్రోత్సాహక బహుమతులను గెలుపొందారు. డిబేట్‌లో సమీర్, శశిరేఖ బృందం ద్వితీయస్థానం, లోక్, పుష్పలత, దీక్ష, విజయలక్ష్మి బృందం తృతీయస్థానం, అబ్దుల్ సమాద్, ఇమ్రాన్ ఆలీ బృందం ప్రోత్సాహక బహుమతులను సాధించారు. విజేతలను జిల్లా సైన్సు అధికారి, అంధుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎబినేజర్ అభినందించారు.

విద్యార్థులకు ఇచ్చిన హామీల అమలుపై అసెంబ్లీలో చర్చించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కారం కొరకు ఎన్నికలలో విద్యార్థులకు విద్యారంగానికి ఇచ్చిన హామీలు అమలు కోసం ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీలో చర్చించి వాటి పరిష్కారం కోసం మార్గం చూపాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయకార్యదర్శి ఎల్ చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలో భాగంగా నగరంలోని కోటి రెడ్డి సర్కిల్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హామీల అమలుపై శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు పెద్దలపల్లి ప్రభాకర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్, జిల్లా ఉపాధ్యక్షులు లీలా కృష్ణా, ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి తేజ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో అంగన్వాడీలకు 42 రోజుల సమ్మె కాలపు హామీలు మినిట్స్ జీవోలు అమలు చేసి కనీస వేతనాలు అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్ నాగసుబ్బారెడ్డి కోరారు. శుక్రవారం నగరంలోని హోచిమిన్ భవన్‌లో అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అంగన్వాడీలు చేసిన సుదీర్ఘ పోరాటానికి నేటి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న సెంటర్ బిల్లులు, టిఎ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, జిల్లాలో హెల్పర్ల ప్రమోషన్లలో రాజకీయ జోక్యం అరికట్టి అర్హులైన వారందరికీ ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకురాలు రాణి, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కేసి.బాదుల్లా, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు సుజాతమ్మ, విజయ, భవాని, శాంతకుమారి, ప్రభావతి, లక్ష్మీదేవి, లలిత, తారాదేవి పాల్గొన్నారు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో డ్రైవర్లు ప్రమాద రహిత డ్రైవింగ్ చేస్తూ విధులు నిర్వర్తించాలని కడప ట్రాఫిక్ పోలీసుస్టేషన్ సీఐ జావీద్ పిలుపునిచ్చారు. శుక్రవారం కడపలోని ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో ప్రమాదాలు చేసిన డ్రైవర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ డ్రైవర్లు విధి నిర్వహణలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ముఖ్యంగా మద్యం సేవించి, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. అలాగే బస్సులు ఓవర్‌టేక్ చేసే సమయంలో మరింత జాగురూకత ప్రదర్శించాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మీ వల్లే ఆర్టీసీకి మంచి పేరు వస్తుందని గుర్తించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేలు డిపో మేనేజర్ నిరంజన్, కడప డిపో ఈఐ రామయ్య, జిల్లా సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ సుధా కృష్ణారెడ్డి, జిల్లా సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ సుధా కృష్ణారెడ్డితోపాటు వివిధ డిపోలకు చెందిన డ్రైవర్లు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు మేయర్‌కు ఆహ్వానం



దసరా ఉత్సవాలకు ఆహ్వానం పలుకుతున్న ఆర్యవైశ్య ప్రతినిధులు

కడప కార్పొరేషన్: కడప నగరంలోని అమ్మవారిశాలలో జరిగే శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరు కావాలని ఆర్యవైశ్య సంఘం నాయకులు కోరారు. శుక్రవారం రాత్రి మేయర్ సురేష్‌బాబుకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాదిలాగే ఈ సారి కూడా దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని, ప్రజా ప్రతినిధులందరినీ ఈ ఉత్సవాలకు ఆహ్వానిస్తున్నామని తెలిపారు.

ఆడిటర్ సయ్యద్ అహ్మద్‌కు పరామర్శ

అనారోగ్యంతో బాధపడుతున్న ఆడిటర్ సయ్యద్ అహ్మద్‌ను మేయర్ సురేష్ బాబు పరామర్శించారు. శుక్రవారం కడప నగరం కో ఆపరేటివ్ కాలనీలో ఉన్న స్వగృహానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్. యానాదయ్య, కిరణ్, యల్లారెడ్డి పాల్గొన్నారు.

వన భోజన కరపత్రాల ఆవిష్కరణ



వనభోజన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బలిజ సంక్షేమ సంఘ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కార్తీక మాసాన్ని పురస్కరించుకని నవంబరు 2వ తేదీన బలిజల వన భోజన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బలిజసంక్షేమ సంఘ నాయకులు తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం కడపలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వన భోజన కార్యక్రమానికి సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. శ్రీ కృష్ణదేవ రాయల వంశస్తులైన ముగ్గురాళ్ల అమరప్ప ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో జిల్లాలోని బలిజ సంఘీయులు కుటుంబ సమేతంగా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం గౌరవ అధ్యక్షుడు అమరప్ప, అధ్యక్షులు సగినాల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి మదరాసు రెడ్డయ్య, మాజీ కార్పొరేటర్ బండి బాబు తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో నీరు నిలబడకుండా చర్యలు



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: వర్షాకాలంలో రోడ్లు, ఖాళీ స్థలాల్లో నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన ఈస్ట్ జోన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించాలని, ప్రతి మురికి కాలువను శుభ్రపరిచి, పూడికను తొలగించాలన్నారు. 4వ డివిజన్‌లో కార్పొరేషన్ పరిధిలోకి వచ్చే ప్రతి పల్లెలో వీధి వీధికి వాహనాలను పంపి చెత్త సేకరించాలన్నారు. అనంతరం పాత బస్టాండులో అన్న క్యాంటీన్‌ను సందర్శించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో నగరపాలక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో వాన

కడప కార్పొరేషన్: ఈశాన్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కడప నగరంలో శుక్రవారం తెల్లవారుజామున, సాయంత్రం వేళలో జోరు వాన కురిసింది. పగటిపూట ఎండ వేడిమి ఎక్కువగానే ఉన్నప్పటికీ సాయంత్రానికి మబ్బులు కమ్ముకొని వాన కురిసింది. వర్షం వల్ల పలు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచింది. పాదచారులు, తోపుడు బండ్ల వ్యాపారులు, వీధి వ్యాపారస్తులు ఇబ్బందులు పడ్డారు. వాన వల్ల పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.